రోగులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఇబ్బంది లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పిడి యాట్రిక్స్, బాలింతలు, గర్భిణీలు, ట్రామా కేర్ వార్డులలో ముందస్తు ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంభర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలలో విద్యుత్, మంచినీటి సౌకర్యాలపై వైద్యారోగ్యశాఖ, విద్యుత్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు లేదా విపత్కర పరిస్థితులలో విద్యుత్ సరఫరా అంత రాయం జరిగిన ప్రత్యమ్నాయ సరఫరా కోసం జనరేట ర్లను, అవసరంమైన డీజిల్, టెక్నికల్ సిబ్బంది ఎల్లప్పుడు సిద్ధంగా ఉండేలా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అవ సరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల లోని అన్ని వార్డులలో వేసవి ఎండలు దృష్ట్యా రోగుల, వారి సహాయకుల అవసరం మేరకు తాగునీటిని అందుబా టులో ఉంచాలని, ఆసుపత్రి అవరణలో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధి కారులు సాంకేతిక ఇబ్బందులతో విద్యుత్ సరఫరాను నిలిపివేసే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులలోని విద్యుత్ ఇంజనీరింగ్ అధికారులకు ముందస్తుగా సమాచారం అందించి వారు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డా. శ్రావణబాబు, డీసీహెచ్ఎస్ డా. హనుమంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి, విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ విధానం ప్రారంభం : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మేరీ లైఫ్-మేరీ స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా గుంటూరు నగరంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) విధానాన్ని శనివారం నగరంలోని అన్ని డివిజన్లలో ప్రారంభించామని కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌కి 1 చొప్పున మొత్తం 57 ఆర్.ఆర్.ఆర్ సెంటర్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రారంభించారు. నగరవాసులు, వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న ఉపయోగించని, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, ఉపయోగించని పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఆర్.ఆర్.ఆర్ సెంటర్ల నందు అందిస్తే, వాటిని పునర్వినియోగం, పునరుద్ధరణ లేదా కొత్త ఉత్పత్తికి నగర పాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై, నగర పాలక సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర-పొన్నూరు : అంబేద్కర్ సెంటర్లో ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు, వెంకటేశ్వర భవన్ అధినేత అంబటి వెంకటేశ్వరరావు శనివారం పాల్గొని ప్రయాణికులకు, పాద చారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎమ్మెల్యే కిలారి రోశయ్య తన సొంత ఖర్చులతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణికులకు వేసవి తాపం తీర్చేందుకు ఉచిత మజ్జిగ శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ భక్తుడు, ప్రజా సేవకులు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని ఆంధ్రకేసరి అభిమాన సంఘం అధ్యక్షుడు బందా శశిధర్ అన్నారు. శనివారం ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ప్రకాశం చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బందా శశిధర్ మాట్లాడుతూ భరతమాత గర్వించదగ్గ నేతల్లో ఆంధ్ర కేసరి టంగుటూరి ముందు వరసలో ఉంటారన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తెల్లోడి తుపాకీ తూటాకు తన గుండెను చూపించి కాల్చామని సవాల్ చేసిన ధీరుడు అని, ఈ నేపధ్యంలో ప్రజలు ఆయనను ఆంధ్ర కేసరి అన్న బిరుదుతో గౌరవించారన్నారు. నివాళులర్పించిన వారిలో బ్రాహ్మణ ప్రతినిధులు మన్నేపల్లి హనుమంతరావు శర్మ, అన్నంరాజు సాయిరాం, సుబ్రమణ్యం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి: పెనుమాక గ్రామంలోని జూని యర్ ప్రభుత్వ కళాశాలలో కళ్ళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. టోర్నమెంట్‌లో మొత్తం 64 జట్లు పోటీ పడగా శనివారంతో సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు ముగిశాయి. సీతా సిసి, నాయక్ సిసి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు కళ్ళం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో సీతా సిసి, ఆరా ఫౌండేషన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సీతా సిసీ జట్టు ఘన విజయం సాధించింది. టోర్నమెంట్ నిర్వహకులు కళ్ళం గోవింద రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పోటీలు చాలా ఉత్సాహభరితంగా సాగుతున్నా యని, యువకుల్లోని ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు చాలా దోహదపడతాయని అన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : బడి ఈడు పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠ శాలలో చేర్పించాలని కోరుతూ వట్టిచె రుకూరు మండల పరిధిలోని సీఎస్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వింజనంపాడు ఉపాధ్యాయ బృందం వింజనంపాడు గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వింజనంపాడు గ్రామంలోని బడి ఈడు పిల్లలున్న ఇంటింటికి ఉపాధ్యాయులు తిరిగి ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యతోపాటు జగనన్న విద్యా కానుక ద్వారా యూనిఫామ్, షూస్, బుక్స్, బ్యాగ్, జగనన్న గోరుముద్ద ద్వారా పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుని డి.కళ్యాణి జయ లూక్ మాట్లాడుతూ విద్యార్థుల సమాగ్రాభివృద్ధికి క్రీడలు, పాఠ్యాంశాలు, సహ పాఠ్యాంశాలలో సమగ్ర శిక్షణ అందిస్తా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎలిజిబెత్ రాణి, శైలజ, డి.చంద్రిక, శివకుమారి, డి.సుధీర్, నాగమల్లేశ్వరరావు, గేరా మోహనరావు, వీరయ్య, లక్ష్మీ కుమారి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

నలుగురికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దుగ్గిరాల : చిన పాలెం గ్రామానికి చెందిన శిఖాపల్లి మరియమ్మ, బుల్లా సురేష్, పాలడుగు శ్రీనివాస రావు, తాడిబోయిన అంజలిలకు శనివారం రూ.10 వేలు చొప్పున రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అందజేశారు. చిన్న పాలెం గ్రామంలో నాలుగు కుటుంబాలకు ఆనారోగ్య కారణంగా కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని వారికి సాయం అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, స్థానిక వైసీపీ నాయకులు సుబ్బారావు, శిఖాపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వేల కోట్ల దోపిడీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పంపిణీ, పక్కా ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ ప్రభుత్వం వేలకోట్ల దోపిడీకి పాల్పడిందని టీడీపీ నాయకులు యల్లావుల అశోక్, గుడిమెట్ల దయారత్నం అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను ప్రభుత్వం పక్కన పెట్టి అమరావతి ప్రాంతంలో పేదలకు సెంటు భూమి ఇస్తున్నామని కొత్త మోసానికి తెరతీశారన్నారు. అమరావతి ప్రాంతం మునిగిపోయేదని, శ్మశానమని, ఎడారి అని ప్రచారం చేసిన వైసీపీ నాయకులు.. ఏ విధంగా రాజధానిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. అమరావతిని నాశనం చెయ్యడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని దీనిని ప్రజలు గమనించాలని కోరారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి, టీడీపీ చంద్రబాబుని విమర్శించే స్థాయి లేదని, ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నూకవరపు బాలాజీ, గోళ్ళ ప్రభాకర్, గుడిపల్లి నవీన్, షేక్ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

తెల్లదొరల తుపాకీకి ఎదురొడ్డిన ధీరుడు టంగుటూరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: తెల్లదొరల తుపాకీ గుండుకు తన గుండెను ఎదురొడ్డిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన వీరత్వం...మార్గదర్శకత్వం. .అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కొని యాడారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్‌లో ఎమ్మెల్యే మద్దాళి గిరి తదితరులతో కలిసి టంగుటూరి విగ్రహానికి అప్పిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోధత్తుడుగా ఆయనను అభివర్ణించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ పదవుల కోసం కాక ప్రజల కోసం పరితపించిన మహనీయుల్లో ముఖ్యుడని, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడుగా ఆయన నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ప్రకాశం పంతులు విగ్రహ దాత సుధాకర్, కార్పొరేటర్ అంబేద్కర్, ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేతలు ఐతి సతీష్, బందా శశి, శ్యామ్, హరిప్రసాద్, సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రయోజనాలే ముఖ్యం

విశాలాంధ్ర-తాడికొండ : పేదల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ 7,8 వార్డులలో శనివారం గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలు కాలంలో పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకురాటం జరిగిందన్నారు. కులమత పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నా మన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం ఎంతోకొంత చేయూతను అందించిందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏనాడైనా పేదల సంక్షేమం గురించి పట్టించుకుందా అని నిలదీశారు. సచివాలయాల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. సర్పంచి తోకల సరోజినీ నరసింహారావు, వైసీపీ నాయకులు తాళ్ల శివ నాగరాజు, అబ్దుల్ హుస్సేన్, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, రాచకొండ సాంబశివరావు, జగదీష్ పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందిస్తున్న విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర-తెనాలి : గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు బాలల్లో జ్ఞానం పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని తెనాలి శాఖా గ్రంథాలయ అధికారిణి కాపూరి రమాదేవి చెప్పారు. తెనాలి నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 13వ రోజుకు చేరిన శిక్షణ శిబిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. బాలలకు కావలసిన ఆటవస్తువులు అందుబాటులో వుంచారు. చదువంటే మాకిష్టం - ఆటపాటలే మాకు కావాలి అని బాలబాలికలు ముక్త కంఠంతో వెలుగెత్తి చాటారు. జనరల్ నాలెడ్జ్, చందమామ కథలు, బాలల గేయాలు తదితర పుస్తకాలను పఠనం చేశారు. బాలలు వారు నేర్చుకున్న గేయాలను ఆలపించారు. గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు, సంగీత దర్శకులు బొల్లిముంత కృష్ణ పాటలకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయంలో నిర్వహించు శిక్షణ శిబిరానికి ఇంకా చేరని పిల్లలను తల్లిదండ్రులు పంపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగి పద్మజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన ఎస్సై

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రేమ పేరుతో గుంటూరు నగరపాలెంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కుంచాల రవితేజ అనే ఎస్సై మోసం చేశాడని రెంటచింతల తుమ్మరకోటకి చెందిన షేకినా అనే ఓ యువతి శనివారం తాడేపల్లి కొలనకొండ వద్ద ఉన్న ఐద్వా ప్రతినిధులను ఆశ్రయించింది. గత సంవత్సరం జనవరిలో సీఎం బందోబస్తులో రవితేజ పరిచయమయ్యాడని తెలిపింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మీడియా ఎదుట వాపోయింది. తనను రవితేజ వంచించాడని, అన్ని విధాలుగా వాడుకున్నాడని చెబుతోంది. ప్రస్తుతం రవితేజ నగరంపాలెంలో ఎస్సైగా పని చేస్తున్నాడు. పెళ్లి చేసుకోమంటే మొహం చాటేస్తున్నారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని 15 రోజుల క్రితం ఎస్పీకి స్పందనలో యువతి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో చంపేస్తానని ఎస్సై బెదిరింపులకుపాల్పడుతున్నాడని తాడేపల్లి ఐద్వా ప్రతినిధులను ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలనీ మీడియా ముందు వాపోయింది.

జనసేన నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర-తాడేపల్లి : గుండిమేడ ఇసుక రీచ్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇసుక రీచ్‌కి ప్రభుత్వం ఇచ్చిన అనుమ తుల గడువు అయిపోయినా దొంగ తనంగా ఇసుక తరలిస్తున్న వారికి పోలీ సులు అండగా ఉన్నట్లు విమర్శలు వినిపి స్తున్నాయి. అక్రమ ఇసుక రవాణాను క్వారీలో లారీలను అడ్డుకుని జనసేన నాయకులు నిరసన తెలిపారు. గత నెలతోనే ఇసుక క్వారీకి అనుమతి అయిపోయిన అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు అంటూ జనసేన నాయకులు ఆందోళన చేశారు. పోలీసులు అండతోనే ఇదంతా జరుగుతుందని జనసేన నాయకులు ఆరోపించారు. ఆందోళన చేస్తున్న జనసేన నేతలను పోలీసులు నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకు వెళ్లి పోలీసులు వాహనం ఎక్కించారు. దుగ్గిరాల పోలీస్ స్టేషన్కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, పెనుమాక గ్రామ అధ్యక్షులు చావల గిరి, ఎంటీఎంసీ ఉపాధ్యక్షులు శెట్టి రామకృష్ణ, యువజన నాయకులు శింగంశెట్టి వెంకట్‌లు ఉన్నారు.

శిల్పారామం అందుబాటులోకి తేవాలి : సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలోని శిల్పారామాన్ని తక్షణం ప్రారంభించి నగర ప్రజ లకు అందుబాటులోకి తీసుకురా వాలని, లేకుంటే తెలుగు యువత ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళ నతో ప్రభుత్వాన్ని, పర్యాటక శాఖను ఎండగడతామని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ హెచ్చరించారు. శనివారం తెలుగుయువత బృందం శిల్పారామం ప్రాంగణాన్ని పరిశీలించి అనంతరం ప్రహరీ చుట్టూ మందు సీసాలను ఏరివేసి స్వచ్ఛ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ రూ.4కోట్ల వ్యయంతో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించిన శిల్పారామం నిర్మాణం పూర్తయినప్ప టికీ ప్రారంభానికి నోచుకోకుండా రోజురోజుకి కళావిహీనంగా తయారవుతూ ప్రహరిచుట్టూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, పంచుమర్తి శేషు, కిరణ్ యాదవ్, చెరుకుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

26న వెంకటపాలెంకు సీఎం

విశాలాంధ్ర-తుళ్ళూరు : సీఆర్‌డీఏ పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ఇంటి పట్టాలు ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసే కార్యక్రమ బహిరంగ సభ ఏర్పాట్లను వెంకటపాలెంలో శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసనమండలి సభ్యులు తలశిల రఘురామ్ పరిశీలించారు. సభా స్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ నిర్మలా, సీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడికి నివాళి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయ కుడు, మాజీ సర్పంచ్ బొడపాటి వెంకటేశ్వ రరెడ్డి (98) అనారో గ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమా చారం తెలుసుకున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదరావు, తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ శనివారం ఫిరంగిపురం సందర్శించి ఆయన భౌతికాయానికి పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. వెంకటేశ్వరరెడ్డి మృతి ఫిరంగిపురం మండలా నికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. చిన్నప్పరెడ్డి, పెరికల జేమ్స్, దాసరి సురేష్‌బాబు, పెరికల మరియబాబు, మేడా బాబు, సాలె నాగరాజు, గఫార్, ఎంవ్రెడ్డి హేమలతారెడ్డి, మెల్కియా, స్వర్ణ చిన్నప్ప, సంగీతరావు, ఆనంద్, కొరివి ఆనంద్, కాకి రామారావు, రాము, గొట్టిపాటి ఇశ్రాయేలు, గొట్టిపాటి వెంకటేష్, కమ్యూనిస్ నాయకులు, కమ్యూనిస్ట్ నాయకులు మార్పుల వెంగళరెడ్డి, షేక్.మస్తాన్‌వలి, హోచ్‌మేన్ మార్పుల లలితకుమారి, వెంకట రత్నం, డా.వెంకటేశ్వరావులతోపాటు పలువురు నాయకులు వెంకటేశ్వరరెడ్డి మృతికి సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. వెంకటేశ్వరరెడ్డికి కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

జనసేనతోనే కార్మికులకు స్వర్ణయుగం

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి రాష్ట్రంలో కార్మికులకు గడ్డు రోజులు మొదలయ్యాయని, కార్మికుల పక్షపాతి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేనతోనే కార్మికులకు స్వర్ణయుగం రానుందని ఆ పార్టీ గుంటూరు అర్బన్ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. శనివారం కోబాల్డ్ పేట, కంకరగుంట ప్రాంతాల్లోని కార్మికులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ వైసీపీ ప్రభుత్వంలో పూట గడవక నరకయాతన పడుతున్నామని, కుటుంబాన్ని పోషించుకోవటం కూడా కష్టమైపోతుందని కార్మికులు కన్నీళ్లపర్యంతమయ్యారు. ప్రధానంగా ఇసుకను బ్లాక్ మార్కెట్ చేసి దానిని ఎప్పుడైతే ప్రధాన వనరుగా ఈ ప్రభుత్వం దోచుకోవడం మొదలైందో అప్పుడే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగం కుదేలై పోవటంతో దానిమీద ఆధారపడ్డ దాదాపు ముప్పై విభాగాల కార్మికులు పనుల్లేక పక్క రాష్ట్రాలకు వలసెల్లిపోయారని కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం, పలు ఉపాధి రంగాల్లోని కార్మికులతో పాటూ రోజు వారీ కూలీల జీవితాలను వైసీపీ ప్రభుత్వం తమ ధనదాహంతో నరకకూపంలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. కార్మికుల సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారని, కార్మికులు ఆయనకు అండగా నిలవాలని నేరేళ్ళ సురేష్ కోరారు. కార్యక్రమంలో ఆళ్ళ హరి, చింతా రాజు, ఆనంద్ సాగర్, పాములూరి కోటి, మెహబూబ్ బాషా, పులిగడ్డ గోపి, చందు శ్రీనివాసరావు, కొత్తకోట ప్రసాద్, సుంకే శ్రీను, చేజర్ల శివ, పసుపులేటి నరసింహరావు, గద్దం రోశయ్య, గట్టు శ్రీకాంత్, కొలసాని బాలకృష్ణ, మధులాల్, కదిరి సంజీవ్, భూషయ్య, చెన్నం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

రేపటి నుంచి ఏపీ జీఈఏ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైసీపీ ప్రభుత్వం గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో ఉద్యోగుల ఏ ఒక్క సమస్య పరిష్కరించనందున 2023, ఏప్రిల్ 30వ తేదీన రాజ మండ్రిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గంలో చేసిన తీర్మానం మేరకు ఈ నెల 22వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యో గుల (ఏపీ జీఈఏ)సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఏపీ జీఈఏ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన జీతభత్యాలుపైన చట్టబద్ధత చేయాలన్నారు. చట్టబద్ధత లేని సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే నిమిత్తం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జీఈఏ జిల్లా సహాధ్యక్షులు మహేష్ బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మావతి, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తయ్య, ఓపీఎస్ సాధన సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్ఞాన్ దేవ్, దుర్గాప్రసాద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎం.ఫార్మశీ రెండవ సంవత్సరం (3వ, 4వ సెమిస్టర్)పరీక్షా ఫలితాలలో హిందూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు నూటికి నూరుశాతం డిస్టింక్షన్‌తో ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 5శాఖలలో 31మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాంటెండ్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, అధ్యాపకులు పరీక్షల్లో ప్రతిభ చూపినవ విద్యార్థులకు తమ అభినందనలు తెలియజేశారు.

కేసీఆర్ పార్టీ గుంటూరు వస్తే ఆంధ్రుల ఆత్మగౌరవం క్షోభిస్తుంది

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కేసీఆర్ పార్టీ గుంటూరుకు వస్తే ఆంధ్రుల ఆత్మగౌరవం మరింత క్షోభిస్తోందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్ర కుక్కల్లారా..రాక్షసుల్లారా అని అవమానించిన కేసీఆర్ ఆ శునకం ఎవరో చెప్పే దమ్ము కేసీఆర్‌కు ఇప్పుడుందా ? అని ప్రశ్నించారు. ఆంధ్ర, తెలంగాణ చెక్ పోస్టుల వద్ద కరోనా రోగులను తెలంగాణాలో అడుగు పెట్టనీయకుండా అంబులెన్స్‌లను నిలిపేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ముక్కును నేలకు రాసి క్షమాపణ చెప్పి ఆంధ్రాలో అడుగుపెట్టగలడా? ఆ సంస్కారం కేసీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. ఇటువంటి తరుణంలో గుంటూరు జిల్లా వాసులు గుంటూరు ముఖద్వారాలను గో పంచకంతో శుద్ధి చేసి గుంటూరు ప్రతిష్టను కాపాడాలని మేడా శ్రీనివాస్ కోరారు.

టంగుటూరి, కాసు ఆశయ సాధనకు కృషి

విశాలాంధ్ర-గుంటూరు : మాజీ ముఖ్య మంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానం దరెడ్డిల ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుం దని డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. గుంటూరు రాజీవ్‌గాంధీ భవన్‌లో వారి వర్ధంతి నిర్వహించారు. చిత్రపటాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ టంగుటూరి, కాసులు ముఖ్యమంత్రుల పదవికే వన్నెతెచ్చారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రిగా, న్యాయవాదిగా, కవిగా టంగుటూరి ప్రకాశం పంతులు ఎన్నో గొప్ప సేవలు అందించారని గుర్తుచేశారు. దేశంలో ప్రతిష్టాత్మ కమైన గొప్ప కంపెనీలను స్థాపించిన దూరదృష్టి గల గొప్ప నాయకుడు కాసు బ్రహ్మానంద రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి రత్తయ్య, అక్కమ్మ చౌదరి, బిళ్ళా సునీల్. మద్ది శ్రీనివాస్, బార్బర్ శ్రీను, గ్యారవారపు శ్రీనివాస్‌రావు, జొన్నలగడ్డ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర-తెనాలి : పట్టణ ప్రజలు పర్యావరణాన్ని పరిరక్షించాలని, అందుకు ప్రతి ఒక్కరు విధిగా తమవంతు కృషి చేయాలని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, తమ వంతుగా పదిమందికి ప్రతి ఒక్కరు పర్యావరణపై అవగాహన కల్పించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ, పట్టణంలో పర్యావరణంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనికి అందరు తమ సహాయ సహకారాలు అందిచాలని కోరారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా "మేరే లైఫ్ మేరే స్వచ్ఛ సేహార్" కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రీసైకిల్ మరియు రియూజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. పట్టణంలో స్థానికంగా 4(ఆర్ఆర్ఆర్ సెంటర్లు) ఏర్పాటు చేశారన్నారు. ఒకటి ఐలమ్మ రజక పార్కు, రెండవది సత్యన్నారాయణ లేక్‌పార్కు, మూడవది ఎన్‌సిఆర్ఎం స్కూల్, నాలుగవది రైల్వే స్టేషన్ ఏరియాలలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యేక టీమ్‌లు అందుబాటులో వుంటాయని అన్నారు. ఈ సెంటర్లలో తమ ఇళ్లలో నిరుపయోగంగా వున్న దుస్తులు, బూట్లు, చెప్పులు, పరుపులు, పుస్తకాలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, పాత సైకిళ్ళు, మంచాలు, చెక్క టేబుళ్ళు, ఎలక్ట్రికల్ ఇతర పరికరాలు, ఇతర సామాగ్రి ఆ టీములకు అందజేస్తే వాటిని అవసర మన్న ఇతరులకు అందిస్తామ న్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.బోపాల్‌రావు, శానటరి ఇన్‌స్పెక్టర్లు, శానటేషన్ సెక్రటరీలు, నగర దీపికలు పాల్గొన్నారు.

ఆప్కో దుకాణాల్లో చేనేత వస్త్రాలపై భారీ డిస్కౌంట్: చిరంజీవి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆప్కోలో పేరుకుపోయిన చేనేత వస్త్ర నిల్వలను క్లియర్ చేసి నేత కళాకారులకు నిరంతర ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్టు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. అందులో భాగంగా ఆప్కో వస్త్ర దుకాణాల్లో చేనేత వస్త్రాలను భారీ డిస్కౌంట్‌తో విక్రయిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెం ఆప్కో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేతల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయా లకు అనుగుణంగా ఆప్కో ద్వారా చేనేత కార్మికుల అభ్యు న్నతి కోసం సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆప్కోలో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే వస్త్ర నిల్వలు ఉన్నాయన్నారు. వాటన్నింటినీ త్వరితగతిన విక్రయించేందుకు ఎంపిక చేసిన వస్త్రాలపై 33 శాతం, 50 శాతం, 66 శాతం రిబేటు ఇస్తున్నట్టు చెప్పారు. దీంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగ డంతోపాటు ప్రైవేటు దుకాణాలకు ధీటుగా ఆప్కో షోరూములను అభివృద్ధి పరిచేందుకు అవకాశం ఏర్పడు తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆప్కో షోరూముల్లో ఈ డిస్కౌంట్ సేల్ అందుబాటులో ఉంటుందన్నారు. బయటి మార్కెట్‌లో స్వచ్ఛమైన చేనేత వస్త్రాలు దొరికే పరిస్థితి లేదని, కేవలం ఆప్కో షోరూముల్లో మాత్రమే చేనేత మగ్గంపై నేసిన వస్త్రాలు లభిస్తాయని చెప్పారు. ఉప్పాడ, వెంకటగిరి, మంగళగిరి, గద్వాల, ధర్మవరం, మదనపల్లె, మాధవరం, బందరు, చీరాల తదితర చేనేత కేంద్రాల్లో తయారైన చీరలు, ధోవతులు, డ్రెస్ మెటీరియల్స్, దుప్పట్లు, టవళ్లు, లుంగీలు, పంచెలు, ఖర్చీఫ్‌లు ప్రత్యేక డిస్కౌంట్‌తో విక్రయించడం జరుగుతుందన్నారు. స్టాకు ఉన్నంతవరకు మాత్రమే ఈ డిస్కౌంట్ సేల్ అందుబా టులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, జెకెసి కాలేజీరోడ్డు, ఆంజనేయ నగర్, జీరో లైను, జయం రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.403రు కాపుర స్తులు కేసరి కోటి రెడ్డి గారి కుమారుడు కేసరి బ్రహ్మా రెడ్డి (సెల్ : 7508506757) అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. B3308600 ఒరిజినల్‌ను ది.09-05-2023న ఆర్టీవో ఆఫీసు నుండి గోరం ట్లకు బైకుపై వెళ్లుచుండగా మార్గమధ్యలో పోగొట్టు కున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

గ్రంథాలయాన్ని సందర్శించిన బత్తుల

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ శనివారం సందర్శించారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిక్షణ శిబిరాన్ని ఆయన వీక్షించారు. 15రోజుల నుండి నిర్వహిస్తున్న ఈ శిబిరంలో విద్యార్థులు ఏం నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ సంఖ్యలో పిల్లలు హాజరయ్యేలా చూడాలని గ్రంథాలయ అధికారి నాగుల్ మీరా వలికి ఆదేశాలు ఇచ్చారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, సిబ్బంది వున్నారు.

కాసు బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఎన్నో పల్లెలను కాంగ్రెస్ పార్టీ నిలయాలుగా తీర్చిదిద్దిన కాంగ్రెస్ మాత ముద్దుబిడ్డ మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి అని రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి గోవింద శంకర్ శ్రీనివాస్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కాసు బ్రహ్మానందరెడ్డి 30వ వర్ధంతి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.ప్రసన్న అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కాసు చిత్రపటానికి పీసీసీ కార్యదర్శులు గోవిందు శంకర్ శ్రీనివాస్, ఉప్పుటూరి అనిల్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ప్రసన్న, న్యాయవాది ఎప్పాల అంజిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం రాధాకృష్ణ, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అన్నపురెడ్డి ఈశ్వర్, చిలకా నాగరాజు, భారత జాతీయ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు షేక్ బాషా, కాంగ్రెస్ బీసీ నాయకులు కుమ్మర శ్రీహరి మాచవరపు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నారా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేదలకు శ్రీ నారా ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ సీఈఓ గోనుగుంట్ల శివ తెలిపారు. శనివారం పలువురు పేదలకు ఫౌండేషన్ తరుపున చేయూత అందించారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొన్న ఆర్ఓ టెక్నీషియన్ వెంకటేశ్వర్లుకు జైపూర్ ఆర్టిఫిషియల్ లెగ్స్ నిమిత్తం రూ.15వేలు ఆర్థిక సహాయం ఆరాధ్యుల రామకృష్ణ సమక్షంలో చిలకలూరిపేట కార్యాలయంలో అందజేశారు. చిలకలూరిపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ప్రక్కన గల దత్తసాయి టవర్స్ నందు వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కంచర్ల రామకోటేశ్వరరావు కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శివ దుర్గా హాసినికి కాలేజీ ఫీజు, పుస్తకాల నిమిత్తం రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి కుర్రా అప్పారావు, ఉన్నవ గ్రామ టీడీపీ అధ్యక్షులు కాకుమాను శ్రీను, బొల్లినేని హనుమంతరావు, కె. సాంబయ్య, పావులూరి శ్రీనివాస్ రావు, పుల్లగూర జాన్, దగ్గుమల్లి కోటేశ్వరరావు, పిచ్చయ్య భక్తవత్సలం, ఎలికా రాఘవులు, పి.సునీల్, పి హనుమంతరావు, పావులూరి చిన్న శ్రీను, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సెంటు కంపు కథనంపై భగ్గుమన్న వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-తుళ్ళూరు : ఆంధ్రజ్యోతి దినపత్రికలో సెంటు కంపు అనే కథనం ప్రచురించినందుకు నిరసనగా తుళ్లూరు మండలం అయినవోలులో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతులను వైఎస్సార్‌సీపీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని అక్కసుతో తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్రజ్యోతి పత్రిక కుమ్మక్కై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని విమర్శించారు. పేదలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పట్ల చంద్రబాబు వివక్షత చూపుతున్నారని, వారి ఎదుగుదల చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. తాను ఇవ్వడు-ఇచ్చిన వారిని ఇవ్వనివ్వడు ఈ సూత్రంతో ఉన్నాడని దుయ్యబట్టారు. చంద్రబాబు తన పాలనలో పేదలకు చేసింది ఏమీ లేదన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి పత్రికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆంధ్రజ్యోతి డౌన్ డౌన్ నిరంకుశ రాతలు నశించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి అవశ్యం

- ఇసుక రీచ్ కార్మికుల ఉపాధి బాధ్యత ఎమ్మెల్యేదే
- పొక్లెయిన్‌లతో ఇసుక లోడింగ్ వద్దు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

విశాలాంధ్ర-అచ్చంపేట : పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు ఎడారి ప్రాంతంగా ఉన్న పెదకూరపాడు నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని ప్రధాన ఇసుక రీచ్‌లు చామ్రు, కోనూరు, కస్తాల, కేవీ పాలెం, కొత్త పల్లి, తాడువాయి రీచ్‌లలో గతంలో పనిచేసిన సుమారు 5000 మంది కార్మికులకు ఉపాధి చూపించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై ఉందని ఆయన అన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు భైరాపట్నం రామకృష్ణ అధ్యక్షతన పెదకూరపాడు నియోజకవర్గ సమస్యలు, రైతు సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. అనం తరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ప్రొక్లెయిన్‌లతో లోడింగ్ చేయించి కార్మికుల జీవనోపాధికి జగన్ ప్రభు త్వం గండికొడుతుందన్నారు. సామాన్యుడికి అందుబా టులో ఉన్న ఇసుక కూడా బంగారం లాగా తయారైంద న్నారు. రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయని, రైతులకు యంత్రాలు, పనిముట్లు, టార్పలిన్ పట్టాలు సబ్సిడీపై ఇవ్వటం లేదన్నారు. మెట్ట ప్రాంతాలైన అచ్చంపేట మండలంలో అకాల వర్షాలకు రైతులు అధిక ధరలు వెచ్చించి పట్టాలు కొనుగోలు చేస్తే నాణ్యతలేని పట్టాలు అమ్మకాలు జరుపుతున్నారన్నారు. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేసి అచ్చంపేట మండలానికి గుర్తింపు తెస్తే ప్రాజెక్టుకు వెళ్లే రహదారులు డొంక రోడ్లు నిర్మా ణాలు లేక ప్రజలు అవస్థపడుతున్నారన్నారు. అంతేకా కుండా సాగర్ కుడిక కాలువలో భాగమైన పెదకూరపాడు నియోజకవర్గంలో సాగునీరు, అదేవిధంగా పల్నాడు జిల్లాకు అతి చేరువులోనున్న కృష్ణానది నుంచి వ్యవసా యానికి సాగునీరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందించేందుకు నిధుల కేటాయింపులో తొలి ప్రాధాన్యత కల్పించాల న్నారు. అచ్చంపేట నుంచి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల న్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని, అదేవిధంగా ఇసుక, సిమెంట్, ఇనుము ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాలలోనున్న అగ్రిగోల్డ్ బాధి తులకు రూ.960 కోట్లను బాధితులకు చెల్లించే విధంగా సీపీఐ కృషిచేసిందన్నారు. ప్రజలు సమస్యలపై పోరాడి అన్యాయాన్ని ఎదిరించడానికి సిద్ధంగా ఉండాలని, అందుకు ఎర్రజెండాలు ఎప్పుడూ కూడా ప్రజల పక్షానే పోరాడుతాయని అన్నారు. ఈ సమావేశంలో పెదకూరపాడు నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, రైతు సంఘం కార్యదర్శి కంచేటి పెద్దబ్బాయి, సీపీఐ నాయకులు సంపంగుల ఏడుకొండలు, పి.కోటేశ్వరరావు, పి.మధు బాబు, రంగారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాటు నాటు సంగీత విభావరి ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-నరసరావుపేట : సుశీల్ ఎంటర్‌టైన్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఎంఎం కీరవాణి ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటునాటు పాట ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపునిచ్చిన సంధర్భాన్ని పురస్కరించుకొని సుశీల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత డాక్టర్ బీఆర్ సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన నాటు నాటు సంగీత విభావరిలో ప్రముఖ గాయనీ గాయకులు కీరవాణి స్వరపరచిన పాటలను అద్భుతంగా పాడి వినిపిస్తారని కార్యక్రమానికి ప్రతిఒక్కరూ విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సంగీత విభావరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుశీల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత డాక్టర్ బీఆర్ సుశీల్ కుమార్, ప్రముఖ గాయకులు ఓగూరి నాగేశ్వరరావు, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.4 లక్షలు గోల్‌మాల్

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని ఓ ప్రభుత్వ మద్యం షాపులో సుమారు రూ.4 లక్షల సరుకు గోల్‌మాల్ అయినట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి హుటాహుటిన విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ మద్యం షాపుకు చేరుకొని విచారణ చేపట్టారు. షాపులో పనిచేస్తున్న సూపర్‌వైజర్ అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీస్ కేసు నమోదు అవుతుందనే భయంతో సూపర్‌వైజర్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనితో హుటాహుటిన మాచర్లలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. విషయం బయటకు పొక్కకుండా సొమ్మును తిరిగి కట్టించే విధంగా ఎక్సైజ్ అధికారులు రాజీకుదురుస్తున్నట్లు తెలిసింది. సూపర్‌వైజర్ డబ్బును ఐపీఎల్‌లో బెట్టింగ్ పెట్టినట్లుగా సహచరులు చర్చించుకుంటున్నారు. విజయపురిసౌత్‌లో ఇటువంటి సంఘటన జరగడం ఇది రెండో సారి కావడం గమనార్హం. గతంలో కూడా డౌన్ మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో ఓ సూపర్‌వైజర్ సుమారు రూ.2 లక్షల వరకు గోల్‌మాల్ చేయగా ఎక్సైజ్ అధికారులు కేసు పెట్టకుండా రాజీ చేసి డబ్బు తిరిగి కట్టించుకొని అతనిని విధుల నుంచి తొలగించిన విషయం అందరికీ తెలిసిందే.

జగనన్న ఆణిముత్యాలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యధిక మార్కులు సాధించిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను సత్కరించేందుకు నిర్వహిస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జిల్లా స్థాయిలోను, నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహించేలా అధికారులు పటిష్ట ప్రణాళికతో సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి సంయుక్త కలెక్టర్ రాజకుమారితో కలసి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో 23 మందిని, జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఎంజీఎంటీ కేటగిరిలో ఐదుగురును, ఏపీఆర్ఈఎస్ఐ కేటగిరిలో ఐదుగురును, సంక్షేమ వసతి గృహాల కేటగిరిలో ఆరుగురును, ఇంటర్ విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో 14 మందిని, జిల్లా స్థాయిలో ప్రభుత్వ కళాశాల కేటగిరిలో నలుగురిని, ఏపీఆర్‌జేసీ కేటగిరిలో ముగ్గురును సన్మానించటానికి ఎంపిక చేశారని వివరాలను సంబందిత ఎంఈవోకు అందించటం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రాలలో పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో చంద్రశేఖరరావు, ఇంటర్మీడియట్ విద్యా ఆర్ఐఓ సునీత, డీఈవో శైలజ, సమగ్ర శిక్ష్ ఏపీసీ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి : నటరాజనాట్యాలయం, న్యూ మాంగ్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రపదేశ్ అధ్వర్యంలో కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. దక్షిణ భారతదేశంలో ఉన్న అన్ని రకాల యుద్ధ కళలు(మార్షల్ ఆర్ట్స్), నాట్య మయూరి, నాట్య భగీరథ, భరతనాట్యం, కూచిపూడి, కథకళి వంటి వివిధ శాస్త్రీయ, జానపద నృత్యంతో పాటు యుద్ధ కళలను ప్రదర్శించడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటు ముంబయి వంటి పలు ప్రాంతాల నుంచి కళాకారులు హాజరవుతున్నారని కేఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తెలిపారు. నృత్య ప్రదర్శనకు న్యాయనిర్ణేతలుగా విశాఖకు చెందిన ప్రబాకర్, హైదరాబాదుకు చెందిన పోతిని శ్రీనివాసరావు, గుమ్మళ్ల ప్రభాకరరావులు వ్యవహరించగా నిర్వాహకులు కేఎల్‌యూ ఛైర్మన్ కోనేరు సత్యన్నారాయణ, విశ్రాంత ఎస్పీ సిహెచ్ చక్రపాణి, ఎం.ఎస్.రవికుమార్, కె.రాజశిఖామణి, జీవీఎస్ ఆర్.ప్రసాద్, నంది అవార్డు గ్రహీత ఎస్.రాజ్ కుమార్, మువ్వగోపాల ఆర్ట్స్ అకాడెమీ కళ్యాణ్, జీవీ రాఘవ, ఎయిర్ ఇండియా నుంచి ఎంఎస్.విజయ్, హైకోర్టు న్యాయవాది డాక్టర్ దామోదరంలు పాల్గొన్నగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావులు కళాకారులను అభినందించారు.

పశు వైద్యశాలను సందర్శించిన ఉపసంచాలకులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పశువైద్యశాలను శనివారం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కేదారేశ్వర్, తాడేపల్లి మండల పశు వైద్యులు డాక్టర్ నరేందర్ రెడ్డి సందర్శించారు. ఈనెల 18వ తేదీన శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు, సీపీఎం పార్టీ నాయకులు గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలసి తాడేపల్లి మండలంలోని వివిధ సమస్యల పరిష్కారం చేయాలని విన్నవించిన క్రమంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు, పశు వైద్యులు చిర్రావూరు గ్రామంలోని పాడి రైతులను, గ్రామస్తులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అత్యధికంగా పశువులు ఉన్న చిరావూరు గ్రామంలో పశువులకు వ్యాధులు సోకినప్పుడు ప్రైవేట్ డాక్టర్ వద్దకు, వేరే గ్రామం వెళ్లాల్సి వస్తుందని రైతులు తెలిపారు. గ్రామానికి పశు వైద్యున్ని నియమించాలని రైతుల కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వారానికి ఒకసారి సంచార పశు వైద్య వాహనం ప్రతి గ్రామానికి వస్తుందని, గ్రామంలోనూ ఏహెచ్‌ఏ అందుబాటులో ఉంటారని, పాడి రైతులు పశు సంచార వైద్య వాహనం ద్వారా సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కేదారేశ్వర్‌తో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి చిర్రావూరు గ్రామంలో గేదలు, గొర్రెలు, మేకలు అత్యధికంగా ఉన్న గ్రామమని, పాడినే జీవనాధారంగా చేసుకొని పాడి రైతులు జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి మండల సమితి కార్యదర్శి ముసునూరు సుహాస్, సీపీఎం గ్రామ నాయకులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, ఇప్పటం సొసైటీ మాజీ అధ్యక్షులు కాసినేడి బాజీ గంగాధరరావు, దనేకుల పూర్ణచంద్రరావు, మొక్కపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డయారైస్‌తో నియంత్రణలో షుగర్

విశాలాంధ్ర-అమరావతి : నూతన వంగడం ద్వారా పండించిన డయారైస్‌ను తినటం వలన షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుందని భావన దయా రైస్ చైర్మన్ జె.సుధీర్ అన్నారు. అమరావతి పట్టణంలో కళ్యాణి రైస్ ట్రేడర్స్‌ను శనివారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. దయాబెటిక్ ఉన్నవారికి ఈ రైస్ తినడం వలన షుగర్ కంట్రోల్‌లో ఉండడంతో పాటు ఆరోగ్యపరంగా అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతిలో ఈ డిస్ట్రిబ్యూటర్ కేంద్రం ఏర్పాటు ఈ ప్రాంతంలో షుగర్ ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దయారైస్ కావలసినవారు తమను సంప్రదించవచ్చని కళ్యాణి రైస్ ట్రేడర్స్ నిర్వాహకులు వి.కళ్యాణి అన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రోమన్ క్యాథలిక్ మిషన్ ఫాదర్ పిట్ల మరియదాసు, వలివేరు ఆర్‌సీఎం చర్చ్ విచారణ గురువులు గంటెల మరియదాసు, ఏపీ ప్రజా నాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామ కృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, గొట్టెం భాస్కరరావు, వెలితోటి రాజు, కర్ల భూలక్ష్మి పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ యాప్‌పై అవగాహన

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు స్కిల్ డెవలప్‌మెంట్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ రామావతు కిరణ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో 10 వతరగతి చదివి 15 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న యువతి, యువకుల పేర్లను యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. వారికి మాచర్ల స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లో మూడు నెలలు ఉచితంగా డెమోస్టిక్ డేటా ఆపరేటర్ కోర్సును నేర్పించి ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తామన్నారు. దీనిపై కార్యదర్సులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మినీ మహానాడు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మినీ మహానాడును ఈ నెల 22న ఉదయం 10:00 గంటలకు పట్టణంలోని జమిందార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని, ఈ మినీ మహానాడును విజయవంతం చేయాలనీ నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు సారథ్యంలో టీడీపీ వ్యవస్థాపకులు దివంగత మహానేత, నందమూరి తారకరామారావు శత జయంతిని పురస్కరించుకొని కార్యకర్తలు, అభిమానుల మధ్య ప్రతి ఏటా రెండు రోజులపాటు మహానాడును పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, క్షేత్రస్థాయిలో టీడీపీ పార్టీని బలోపేతం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో ఉన్న సభ్యులు, క్రియాశీల కార్యకర్తలు, వారి సభ్యత్వ కార్డుతో హాజరుకావాలని కోరారు.

ఇంటిలోకి దూసుకెళ్లిన మినీ లారీ

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి మినీ లారీ ఓ ఇంటిలోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం జరిగింది. వినుకొండ మండల పరిధిలోని విఠంరాజుపల్లి గ్రామం వద్ద జరిగిన ఈ సంఘటనలో గుంటూరు వైపు నుంచి వినుకొండకు వస్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించిపోయి అదుపుతప్పడంతో ఓ ఇంటిలోకి దూసుకెళ్ళింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

విశాలాంధ్ర-శావల్యాపురం: యువగళం పాదయాత్రకు సంఘీభావంగా ఈనెల 15వ తేదీన మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆద్వర్యంలో వినుకొండ నుండి శావల్యాపురం వరకు చేపట్టిన పాదయాత్రకు ముందస్తు అనుమతులు లేకుండా ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించినందుకు గాను పలువురు టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గల్లా రవికృష్ణ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా బహిరంగ సభ నిర్వహించడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని గంటవారిపాలెం గ్రామానికి చెందిన కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షులు కర్నా శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో, ఆయన ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మరికొందరు టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

భూమిని రక్షించుకోవడం మనందరి బాధ్యత

విశాలాంధ్ర-పొన్నూరు : తాళ్లపాలెం గ్రామం సంగమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో శనివారం పొన్నూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచుట అనే విషయంపై శిక్షణ కార్యక్రమం రైతులకు వివరించారు. రబీ పంట జొన్న, మొక్కజొన్న వ్యవసాయ వ్యర్థాలను తగుల పెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచాలని ఇందుకు అవసరమైన కన్సర్షియ ఏ, బి అనే శిలీంద్రం, బ్యాక్టీరియాలను వానపాముల ఎరువు లేదా పశువుల ఎరువులతో కలిపి వ్యవసాయ వ్యర్థాలను మల్చర్‌తో చిన్న చిన్న ముక్కలుగా చేసుకొని పైన కలిపిన మిక్చర్‌ను పొలం పైన పిచికారి చేయాలని తెలిపారు. ఇందుకు నేలలో తేమ ఉండేటట్టుగా చూసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ వలన వ్యవసాయ వ్యర్థాలు అన్నీ కూడా కుళ్ళి భూమికి సేంద్రియ ఎరువుగా చేర్చబడుతుందని వివరించారు. ఏడిఏ సిహెచ్ తిరుమల దేవి మాట్లాడుతూ వ్యర్థాలు కాల్చడం వలన వాతావరణ సమతుల్యత లోపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం టీపీడీ పి.రామాంజనేయుల, ఏవో రాజవంసి, గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రం నుంచి ఎమ్.గంగాదేవి(సైంటిస్ట్), పొన్నూరు ఏడీఏ సిహెచ్ తిరుమల దేవి, పొన్నూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొద్దులూరు రంగారావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఎం.పద్మలీల, తాళ్లపాలెం సర్పంచ్ వీరయ్య, ఆరెమండ సర్పంచ్ అప్పారావు, స్థానిక ఏఓ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. తదుపరి డీకంపోజర్‌ను ఒక ఎకరానికి సరిపడే విధంగా ఎలా తయారు చేసుకోవాలో రైతులకు తెలియజేశారు. క్షేత్ర సందర్శన నిర్వహించి పొలంలో మల్చర్‌తో వ్యవసాయ వ్యర్థాలను ఎలా చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవచ్చు రైతులకు చూపించారు. రైతులందరూ రాబోవు రోజుల్లో ఈ పద్ధతిని పాటించి భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రతి సంవత్సరము మే మూడవ ఆదివారం హెచ్ఐవి, ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ ప్రపంచ దీప స్మృత్యంజలి దినంగా పాటిస్తున్నారు. పూర్వం ఈ వ్యాధి గురించి అవగాహన లేక చనిపోయిన వారి కుటుంబాలు సమాజంకంగా, ఆర్థికంగా ఎన్నో బాధలు అనుభవిస్తున్నారు. సమాజంలో ఈ వ్యాధి బారినపడిన వారిని మనం ప్రేమతో ఆదరించి వారికి మందులు సకాలంలో మందులు అందచేసి మనోధైర్యం నింపాలి. ఏయిడ్స్ ప్రాణాంతక కాదని, సకాలంలో గుర్తించి మందులు వాడితే వ్యాధి తగ్గిపోతుందని, ఆరోగ్యంగా జీవిచవచ్చునని డాక్టర్లు ప్రకటించారు. వైద్య, ఆరోగ్య శాఖ హెచ్ఐవి బాధితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, తగిన మందులను ఉచితంగా అందజేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు లక్షల మూడు వేల మంది హెచ్ఐవితో జీవిస్తు న్నారు. పల్నాడు జిల్లాలో 9537 మంది సక్రమంగా మందులు వాడుతున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెచ్ఐవి టెస్టులు ఉచితంగా చేస్తున్నారు.

+ హెచ్ఐవి వ్యాధి లక్షణాలు : మూడు నెలలు జ్వరం నిరంతరం వస్తూ పోతూ ఉండటం, బరువు తగ్గిపోవడం, డయోరియా ఉన్నవారు హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలి. గర్భవతులు కూడా మొదటి మూడు నెలలో హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలి. తల్లి నుంచి బిడ్డకి హెచ్ఐవి రాకుండా మందులు ఉన్నాయి. కాబట్టి ప్రతి గర్భవతి పరీక్ష చేయించుకోవాలి. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేటల లోని సెంటర్లలో హెచ్ఐవి వ్యాధికి మందులు అందజేస్తున్నారు. హెచ్ఐవితో బాధపడుతున్న వారికి టీబీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి హెచ్ఐవి బాధితులు టీబీ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఏపీఎస్, ఏసీఎస్ ద్వారా ఉచితంగా మందులు అందజేయబడుతున్నాయి హెచ్ఐవి పేషెంట్స్ మందులు సక్రమంగా వాడి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని ఆశిద్దాం.

చెరువు నిండినా.. నీరు కరువేనా..?

విశాలాంధ్ర-రాజుపాలెం : రాజుపాలెం మండల పరిధిలోని కోట నెమలిపురి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న చెరువును, ఓవర్ హెడ్‌ను నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గతంలో సందర్శించి ప్రజలకి నీరు అందించేలా చర్యలు చేపడదామని చెప్పటమే తప్ప ఒక్క అడుగు ముందుకు సాగింది లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 18 ఎకరాలలో రూ.400 లక్షలు వెచ్చించి కోట నెమలిపురి చెరువు తీసి ఒక మంచినీటి ట్యాంక్ పంపు హౌస్ ఆ చెరువు కింద్ర ఉన్న గ్రామాలలో ఓవర్ హెడ్ నిర్మాణం చేసిన విషయం విధితమే. రాజుపాలెం మండలంలోని అనుచులవారి పాలెం, కోటనెమిలి పూరి గ్రామ శివారులో తమ వ్యవసాయ పొలాలను ప్రజలందరి తాగు నీరు శ్రేయస్సు కోసం రైతులు తమ పంట పొలం సైతం ప్రభుత్వానికి అందించారు. ఆ చెరువు నిండితే ఎగువ వ్యవసాయ రైతుల సైతం తమ వ్యవసాయ బోరుబావులు పెరిగి తమ పంట భూములు పచ్చగా మారుతాయని ఎంతో సంతోషించారు. నీటి పంపిణీలోనూ అధికారులు నిర్లక్ష్యం చోటుచేసుకోవడంతో చెరువు నిండినా తాగు నీరు కరువుకు చిరునామాగా మారింది. కోట నెమలిపురి, అంచులవారి పాలెం, అనుపాలెం, నెమలిపురి, శ్రీనివాస నగర్ గ్రామస్తులు తాగునీరు సదుపాయం లేక ఆయా గ్రామాల ప్రజలు తాగునీరు కోసం రోజు నిత్యం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తూ నీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలలో 20 లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రజల తాగునీటి సౌకర్యార్థం తాగునీటి పథకాల పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికి వీసమెత్తు ఫలితం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి అన్ని గ్రామాలకు త్రాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : భేటీ బచావో, భేటీ పడావో అంటూ ఊదరగొడ్తున్న మోదీ మహిళా మల్ల యోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను ఎంపీ సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెన్షన్ చేసి అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు చెరుకుపల్లి నిర్మల డిమాండ్ చేశారు. ఏపీ మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ వినాయకరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ఎన్నో రోజులుగా తమకు న్యాయం చేయాలని పోరాడుతున్న మహిళా మల్లయోధులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదయిన వెంటనే నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి విచారణ చేపట్టాలని చట్టంలో స్పష్టంగా ఉన్నా బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకపోవడం వెనుక మోడి హస్తం ఉందని ఆమె ఆరోపించారు. దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులకు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే బీజేపీ ప్రభుత్వానికి మహిళల పట్ల గౌరవం లేదని, వారి సమ స్యకు పరిష్కారం చూపించే అవకాశం లేదని మరోసారి మన దేశ రెజ్లర్ల లైంగిక వేధింపుల నేపథ్యంలో రుజువైందని ఆమె ఎద్దేవా చేశారు. జనవరిలో జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన మహిళా రెజ్లర్లకు తగిన న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి అందుకు ప్రత్యేక కమిటీని కూడా నియమించిందని ఆ కమిటీ రిపోర్టును ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు బయట పెట్టలేదని ఆమె ప్రశ్నించారు. కమిటీ రిపోర్టును దాచిపెట్టి ఎంపీపై చర్యలు చేపట్టకుండా రెజ్లర్ల సమస్యను పరిష్కరించకుండా పైగా మహిళా రెజ్లర్లపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పలపాటి రంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, మహిళా సమాఖ్య నాయ కులు బోడేపుడి లలిత, దేవి పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పీ.23/2023

బిట్వీన్ :
కొప్పుల లక్ష్మారెడ్డి - పిటిషనరు

వర్సెస్

1. రెంటాళ్ళ ఆంజనేయులు, 2.పంతంగి వెంకట శివప్రసాద్, 3. కట్టమూరి మల్లీఖార్జునరావు, 4. కర్నాటి కేశవరావు, 5. సాధుల కోటేశ్వరమ్మ, 6. కొప్పుల కేశవరెడ్డి, 7. దాసరి అంజి, 8.తాళ్ళూరి సాంబశివరావు, 9. యారం సుబ్బరావమ్మ, 10. కొప్పుల వెంకట రెడ్డి, 11. కొప్పుల శ్రీనివాసరెడ్డి, 12. కొప్పుల రోశిరెడ్డి, 13. కొప్పుల చినమార్కొండారెడ్డి, 14. కొప్పుల రామకోటిరెడ్డి, 15. కొండ్రు సర్‌రెడ్డి, 16. కొండా రమాదేవి, 17. గుజ్జపు పెద వెంకటేశ్వర్లు, 18. గుజ్జపు చిన అంకాలు, 19. బొమ్ము గురవయ్య, 20. బొమ్ము కోటయ్య, 21. బొమ్ము లక్ష్మమ్మ, 22. బొమ్ము నాగయ్య, 23. బొమ్ము బాలరాజు, 24. సుంకర శ్రీను, 25. కాసు వెంకటేశ్వరరెడ్డి, 26. చిన్ని శ్రీనివాసరావు, 27. కేటావత్ శంకర్, 28. గన్నెబోయిన అంజి, 29. ఉడుముల శ్రీనివాసరెడ్డి, 30. జంగిలి శ్రీనివాసరావు, 31. గోపతి శివపార్వతి, 32. దొండపాటి అనంతరామయ్య, 33. లింగా అంజయ్య, 34. సందిటి ఉషారాణి, 35. కడియాల చినవెంకటేశ్వర్లు, 36. మేడం వెంకటేశ్వర్లు, 37. తమ్మా రమాదేవి, 38. మేకల శ్రీనివాసరావు, 39. మట్టపల్లి నారాయణ, 40. పడశాల రామకృష్ణ అలియాస్ గురుస్వామి, 41. ఊర జగదీశ్వర్, 42. సందిటి నాగార్జునరెడ్డి, 43. సందింటి సెల్వారెడ్డి, 44. పట్టిబోయిన శివరామకృష్ణ యాదవ్, 45. షేక్ గఫార్, 46. ది మేనేజర్, ఈశ్వర్ చిట్ కంపెనీ, 47. శివర్ల మల్లయ్య, 48. ముక్కాల కోటిరెడ్డి, 49. నక్కా రాజారెడ్డి, 50. ది అఫీసియల్ రిసీవర్, గుంటూరు - రెస్పాండెట్స్

పై నెంబరు ఐపీ పిటిషనులో శ్రీకోర్టు వారు రెస్పాండెంట్స్‌నకు నోటీసులు ఆర్డరు వేసి వున్నారు. సదరు వాయిదా 19-06-2023 తేది అయి వున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30ని॥లకు స్వయంగా కానీ లేక లాయరు గారి ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసి వున్నది. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

పి.సిహెచ్. మస్తాన్
పిటీషనర్ తరుపు న్యాయవాది
మాచర్ల - 9866082828.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పర్చూరు: గ్రామాలలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపిపి మేకా ఆనందకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఎంపిడిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మంచినీటి కొరత లేకుండ చూడాలని సూచించారు. అధికారులు సమయపాలన పాటించాలని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బాబు వ్యాఖ్యలు సహేతుకం కాదు

విశాలాంధ్ర-పర్చూరు: అమరావతిలో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వటాన్ని ఓర్చుకోలేని చంద్రబాబు సెంటు భూమి శవం పూడ్చటానికి సరిపోదంటూ చేసిన వ్యాఖ్యలు సహేతుకం కాదని నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. వైసీపీ కార్యాలయం నుండి బొమ్మల సెంటర్ వరకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమంచి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని, లేనిచో రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. పేదలకు 50 వేల ఇళ్ళ పట్టాలు ఇవ్వటాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక పోతున్నారని ఆమంచి దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పర్చూరు: పిల్లలు వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు గుడిపాటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థు లకు పద్య పఠనంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ చందోబద్ధంగా పద్యాలను చదివే విధానంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లయితే లయబద్ధంగా ఉంటుందని తెలిపారు. గ్రంథాలయాలపై విద్యార్థులు ఆసక్తి చూపాలని, దానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజిక కార్యకర్తలు ప్రోత్సహించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - బల్లికురవ : శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 13వ రోజు శనివారం నిర్వహించారు. గ్రంథపాలకుడు రమేష్ బాబు అధ్యక్ష తన బాలబాలికలకు కావాల్సిన పుస్త కాలు, క్యారం బోర్డులు, చదరంగం తదితర ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా 15 మంది విద్యార్థులు లైబ్రరీలోని జనరల్ నాలెడ్జ్, చందమామ కథలు, బిజినెస్ ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను పఠనం చేశారు. డాన్సులు,పాటలు పోటీలు నిర్వహించారు. లైబ్రరీకి పిల్లలను తప్పనిసరిగా పంపించాలని తల్లిదండ్రులని గ్రంథ పాలకుడు రమేష్ బాబు కోరారు.

వినాయక ఆలయంలో హుండీ చోరీ

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని చిలుకూరి వారి పాలెం గ్రామంలో వినాయకుని ఆలయంలో హుండీ చోరీ జరిగింది. ఈ ఘటన తెల్లవారుజాము న 3 గంటల మధ్య జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఆలయంలో గ్రిల్స్‌కు ఉన్న తాళం పగలగొట్టి దుండగులు లోపలకి ప్రవేశించి వరండాలో ఉన్న హుండీ అపహరించుకు వెళ్లారు. ఆలయం ఎదురుగా ఓ ఇంటిలో ఉన్న సీసీ కెమెరాలో తెల్లవారు జామున 2:15 నిమిషాల సమయంలో ఒక నాలుగు చక్రాల ఆటో ఆలయం పక్కగా వెళ్లడం రికార్డు అయి ఉన్నందున దుండగులు ఆటోలో వచ్చి హుండీని తీసుకొని పరారైనట్లు స్థానికులు భావిస్తున్నారు. ఉదయం గేటుకు ఉన్న తాళం పగలగొట్టి ఉండటం గమనించిన స్థానికులు ఆలయంలో లోపలికి వెళ్లి చూడగా హుండీ మాయమైనట్లు గమనించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై అనూక్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - చీరాల : ఏపీ మోడల్ స్కూల్,జూనియర్ కాలేజిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ఉచిత విద్య పొంద గోరు విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపాల్ జే.సరళ అన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఎంపీసీ, బైపీసీ, సీఈసి,ఎంఈసి గ్రూపులలో ఉచిత విద్యను అభ్యసించుటకు ఆసక్తి గల విద్యార్థులు మే 22 నుండి జూన్ 7వ తేదీ లోపు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసి,బిసి,ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ 150 చొప్పున దరఖాస్తుతో పాటు రుసుం చెల్లించి https://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్లై చేసుకోవాలని, పదవ తరగతి మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేస్తారని అన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షుడిగా,డీఈవో ఉపాధ్యక్షుడిగా,ఆర్ఐవో, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సభ్యులుగా ఎంపిక కమిటీని నియమించారు. జూన్ పదవ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తారని, జూన్ 11న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 12 నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు. పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందని,ఈ అవకాశాన్ని అర్హత కలిగిన అందరూ ఉపయోగించుకోవాలని ప్రిన్సిపాల్ జే.సరళ తెలిపారు.

పేదల ద్రోహి చంద్రబాబు నాయుడు: మంత్రి

విశాలాంధ్ర - వేమూరు : పేద వర్గాల సంక్షేమాన్ని ఓర్చుకోలేని ద్రోహి చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు మెరుగు నాగార్జున విమర్శించారు. శనివారం వేమూరు నుంచి కొల్లూరు వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. రాజధాని తుళ్లూరు ప్రాంతంలో పేద వర్గాలకు ఇచ్చిన నివేశన స్థలాలను స్మశానాలతో పోల్చిన చంద్రబాబు నాయుడు కు సక్రమమైన బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మెరుగు నాగార్జున నాయకత్వంలో వైసీపీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా వేమూరు మెయిన్ రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళ్లు అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద వర్గాల పక్షంగా అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తూ వారిని ఆదుకుంటున్నారని, జగన్‌పై పేద వర్గాల ఆదరణ చూసి ఓర్చుకోలేక చంద్రబాబు నాయుడు ఇటువంటి విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. చంద్రబాబు ఇకనైనా సక్రమమైన బుద్ధితో ఆలోచించాలని ఈ పాద యాత్ర ద్వారా ఆ దేవుని వేడుకోనునట్లు తెలియజేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, డీసీ ఎంఎస్ మాజీ చైర్మన్ గాజులు మోహన్, వేమూరు కొల్లూరు చుండూరు అమృతలూరు ఎంపీపీలు యల్లమాటి మోహన్,రాపర్ల నరేంద్ర, జాలాది రూబీన్, భట్టిప్రోలు ఎంపీపీ నాగమల్లేశ్వరి, మాజీ ఎంపీపీలు పెరికల పద్మారావు, ఉయ్యూరు అప్పి రెడ్డి, విష్ణు మొలకల వెంక రెడ్డియ్య,పార్టీ నాయకులు దాది సుబ్బారావు, చందోల్ డెవిడ్ విజయకుమార్, ఈవిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతులు కల్పించి నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించి పక్కా గృహాల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. బాపట్లలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ లే-అవుట్ ను జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. పేదల పక్కా గృహ నిర్మాణాలకు అవసరమైన ఇనుము, ఇసుక, సిమెంట్ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. జగనన్న కాలనీలలో రహదారులు వేగంగా నిర్మించాలన్నారు. ముఖ్యంగా నీటి వనరులను సమకూర్చాలన్నారు. ప్యాడిసన్ పేటలో 1,746 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయగా ప్రస్తుతం 615 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 54 గృహాలు స్లాబ్ దశకురాగా, 167 భవనాలు రూఫ్ దశలో ఉన్నవి స్లాబ్ వేసేలా చూడాలన్నారు. మరో 704 గృహాలు పునాది దశలో నిర్మాణాలు జరుగుతుంటే వాటిని రూఫ్ దశకు చేరేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే 206 గృహాలు పునాదికి దిగువన ఉన్నాయని, వాటి నిర్మాణాలు మొదలయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. గృహ నిర్మాణ సామగ్రి లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు తమ గృహాలు నిర్వహించుకునేలా రుణ సదుపాయం వారికి కల్పించాలన్నారు. అవసరమైతే ఆయా గృహాలకు మేస్త్రులను జతచేసి అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం వీడి చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ మందలించారు. తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పురోగతి సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని పలు సూచనలు చేశారు. ఆయన వెంట బాపట్ల ఆర్డీవో జి.రవిందర్, గృహ నిర్మాణశాఖ పిడి ప్రసాద్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలి

విశాలాంధ్ర - సంతమాగులూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు అందరూ పోలీసులకు సహకరించాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ బి.ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నో యాక్సిడెంట్ డే సందర్భంగా బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సంతమాగులూరు పీఎస్ ఎస్సై ఎం.వి.శివకుమార్, పోలీసులు, మహిళా పోలీసులతో కలిసి సీఐ నామ్ హైవేలో వాహనదారులకు అవగాహన కల్పించారు. కొమ్మాలపాడు, ఏల్చూరు, రామిరెడ్డిపాలెం, పుట్టవారి పాలెం జంక్షన్, సంతమాగులూరు, కామేపల్లి తదితర ప్రాంతాల్లో సీఐ పర్యటించారు. స్పీడ్ బ్రేకర్లు, ప్రమాదాలు జరుగు బ్లాక్ స్పాట్లు వద్ద వాహనాల వేగాన్ని నిరోధించేందుకు వీలుగా ఖాళీ టైర్లు, డ్రమ్స్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రాత్రివేళల్లో వాటిని గుర్తించేలా రేడియం స్టిక్కర్లు అంటించారు. అనంతరం హెల్మెట్ ధరించకుండా బైకులపై వెళ్తున్న వారికి, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేనివారు, త్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడిన 40 వాహనాలకు ఈ-చలానాలు విధించారు. ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని, ప్రయాణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మహిళా పోలీసుల సహకారంతో కొమ్మాలపాడులో మహిళలకు దిశా యాప్ పట్ల అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో యాప్ ను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలనే దాని గురించి వివరించారు. స్మార్ట్ ఫోన్లు ఉన్న వారిచేత యాప్ ను డౌన్లోడ్ చేయించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ గోపి, కానిస్టేబుల్స్ సుబ్బారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ అభినందనీయం

విశాలాంధ్ర - చీరాల : రిటైర్డ్ ఉద్యోగులందరు ప్రజా సేవ చేయడం అభినందించదగిన విషయమని చీరాల ఒకటవ పట్టణ సీఐ మల్లిఖార్జునరావు అన్నారు.శనివారం చీరాల గడియార స్తంభం సెంటర్లో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్ అయినప్పటికీ సేవ చేయాలని ముందుకు రావడం చాలా అభినందించదగిన విషయమని,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, ఇంకా ముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.ఈ కార్య క్రమంలో బీహేమంత్ కుమార్,కెఏకాంబరేశ్వర బాబు, బత్తుల బ్రహ్మారెడ్డి,రిటైర్డ్ ఏసీపీ కట్టా రాజ్ వినయ్ కుమార్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏనాగవీరభద్రాచారి,లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని తంగేడుమల్లిలో చెత్త నుంచి సంపద తయారీ (ఎస్.డబ్ల్యూ.పి.ఎస్) కేంద్రాన్ని ఈవోపీఆర్డీ ఆర్వీఎస్ ప్రసాదరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కేంద్రంలోని తొట్టెల్లో తయారవుతున్న వర్మీ కంపోస్ట్ గురించి క్లాప్ మిత్రలను అడిగి తెలుసుకున్నారు. గృహాలు నుంచి సేకరించిన తడి పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు కోసం చేపడుతున్న కార్యక్రమాలపై సెక్రటరీ కె.పున్నారావుతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ ఆఫీసులో రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు.

వెంకటేశ్వర్లు మృతి బీసీలకు తీరని లోటు

విశాలాంధ్ర - బాపట్ల : బీసీల్లోని అన్ని కులాల ప్రజలను సమన్వయపరుస్తూ వారి అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన శిరిగిరి వెంకటేశ్వర్లు కృషి ఎనలేనిదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవ శంకరరావు పేర్కొన్నారు. కర్లపాలెంరోడ్ లోని శ్రీనివాస్ కాలనీలకు చెందిన శిరిగిరి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న శంకరరావు వచ్చి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఒక తాటిపై తేవడానికి కృషిచేసిన ఉత్తమ నాయకుడును కోల్పోవడం తమ సంఘానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా న్యాయ సలహాదారుడు నటరాజు, బాపట్ల నియోజకవర్గం అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, బీసీ నేతలు కంకణాల బాలమ్మ, గోపి, బీవీ రమణయ్య, గండికోట వెంకటరావు, గోపాలరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- పట్టణ సీఐ కృష్ణయ్య

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పి.కృష్ణయ్య వెల్లడించారు. శనివారం పట్టణ ప్రధాన కూడలి వద్ద వాహనాలను పరిశీలించి ప్రమాదాలకు కారణమైన టేప్ రికార్డులను తొలగించి, డ్రైవర్లకు పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటోలు నడిపేవారు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఆటోకు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు అవకాశం ఇవ్వరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలను ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ విక్టర్, మాణిక్యరావు సిబ్బంది పాల్గొన్నారు.

22న ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకలను 22వ తేదీన వ్యవసాయ కళాశాల డీబీనాథ్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎ.విష్ణువర్ధనరెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత విప్లవంలో అద్భుతమైన వంగడాల రూపకల్పన చేస్తూ వ్యవసాయ రంగంలో విశ్వవిద్యాలయం కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై ప్రసంగించి 993 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిచనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, డిఎఆర్ఇ మాజీ సెక్రెటరీ, ఐసిఆర్ జనరల్, చైర్మన్ ఆఫ్ టిఏఏఎస్, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్ నాథ్ సింగ్ పరోడా హాజరవుతారన్నారు. వీరితో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు రానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్టర్ రామారావు డీన్ ఆఫ్ అగ్రికల్చరల్, హెూమ్ సైన్స్, ఇంజనీరింగ్ కళాశాల డీన్‌లు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కమిటీ పరిశీలన

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారి సూచనలతో వెలిగండ్ల సర్వేక్షన్ గ్రామీణ 2023లో భాగంగా మండల స్థాయి కమిటీ సభ్యులు మూడు టీములుగా ఏర్పడి టీం లీడర్ పంచాయతీ కార్యదర్శి షేక్.షకీలా, టీమ్ మెంబర్ గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల రిబ్కా వెంకటరత్నం, టీమ్ మెంబర్ యస్ హైజి (డ్వాక్రా) గోన సోనియాలు శనివారం రామలింగాపురం, రామగోపాలపురం, గన్నవరం, గ్రామపంచాయతీల నందు ఉన్న మౌలిక సదుపాయాలు ఎస్ డబ్ల్యూ ఎం, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్‌లను పరిశీలించి పారిశుధ్య కార్మికులకు సూచనలు ఇవ్వడం జరిగినది, తదుపరి గ్రామ ప్రజలతో మాట్లాడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, గిరిధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ మేఘన, జనార్ధన్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు, రైతు సంఘాల సదస్సు జయప్రదం చేయండి

వడ్డే శోభనాద్రిశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరులో జూన్ 5వ తేదిన తలపెట్టిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాల సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని రైతు సంఘ కార్యాలయంలో రైతు సంఘాల సమన్వయ సమతి సమావేశం శనివారం జరిగింది. డాక్టర్ కొల్లా రాజమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీ వంటి కార్పొరేటర్లకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని రైతు సంఘాల కలయికతో అనేక ఆందోళన ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. కర్ణాటకలో బీజేపీని ఓడించడంలో రైతు సంఘాలు పాత్ర గణనీయమైనదని, దీని ప్రభావంతో రైతులందరూ బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు వేశారని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీతో కర్ణాటకలో సహకారరంగమైన నందిని డెయిరీని దెబ్బతీసే విధంగా చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టడం జరిగిందన్నారు. దీంట్లో భాగమే బీజేపీ చిత్తు, చిత్తుగా ఓడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుకు ఇస్తున్న రూ.6 వేలను గొప్పగా ప్రచారం చేసుకుంటుందన్నారు. అదే కేంద్ర ప్రభుత్వం ఒక రైతు దగ్గర వివిధ రూపాల్లో రూ.60 వేల దోపిడీ చేస్తుందని చెప్పారు. రాష్టంలో ప్రధాన పార్టీలు అన్ని బీజేపీకి వత్తాసు పలకడం బాధాకరమన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి అఖిలపక్ష రైతు సంఘాలు రైతాంగాన్ని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. దీంట్లో భాగంగా జూన్ 5న గుంటూరులో రైతు సంఘాల కలయికతో పెద్ద సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు సుమన్ సహాయ, కర్ణాటక రైతు సంఘం నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు, అభ్యుదయ రైతులు, ఆదర్శ రైతులు, వ్యవసాయ రంగనిపుణులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, వివిధ రైతు సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

పట్టభద్రుల ఆధ్వర్యంలో చలివేంద్ర ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో రావురు రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రావూరు, తిమ్మసముద్రం, చీరాల ప్రయాణం చేయు ప్రయాణికుల, గ్రామ ప్రజల సౌకర్యార్థం త్రాగునీరు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడకు చెందిన ప్రముఖ సామాజిక సేవకులు వంగర వెంకట్రావు మాట్లాడుతూ పట్టభద్రులగా సమాజ సేవ చేయుట చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, కోశాధికారి సజ్జా శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు బుర్ర సాంబశివరావు, ఫౌండర్ మెంబర్ గుడిమూటి శేఖర్, రావి మస్తాన్ రెడ్డి, ప్రత్తి శరత్ బాబు, సభ్యులు వల్లంపట్ల శ్రీనివాసరావు, గొడవర్తి రామకృష్ణ, వేటపాలెం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కోటి స్వామి గుప్తా, ముస్లిమ్ పెద్దలు హాకీమ్, జివికేసి వసతి గృహం ప్రెరక్ సుబ్రహ్మణ్యం, పూల శ్రీనివాసరావు, వుటుకోరి లక్షణ స్వామి, ఐయనాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపల జగనన్న కాలనీలలో గృహ నిర్మా ణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సిహెచ్ కృష్ణ అన్నారు. శనివారం పెద్ద అంబడిపూడి గ్రామంలోని జగనన్న కాలనీలోని నూతనంగా నిర్మిస్తున్న గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గృహ నిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ప్రభుత్వం సకల సౌకర్యాలు అందజేసి, మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. బిల్లులు రావని అపోహ వీడి ప్రతి ఒక్కరు ఇంటి పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ, ఏపిఎం సురేంద్రబాబు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విచారణకు హాజరుకాని ఎంఈఓ

విశాలాంధ్ర - బల్లికురవ : విధి నిర్వహణలో ఉన్న ఉపా ధ్యాయులను వేధింపులకు గురి చేస్తూ నగదు డిమాండ్ చేస్తూ, వారి సమస్యలు పరిష్కరించకుండా నెలల తరబడి తిప్పుకోవడం, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల నుంచి లంచాలు తీసుకోవడం, ఎమ్మార్సీ కార్యాలయం నిధులు పక్కదారి పట్టించడం చైల్డ్ కేర్ లీవ్ బిల్లును సకాలంలో చెల్లించకపోవడం లాంటి అవినీతికి పాల్పడుతున్నా డని బల్లికురవ మండల విద్యాశాఖ అధికారి బండ్ల వీరరాఘవయ్యపై ఇటీవల యుటిఎఫ్ శాఖ ఫిర్యాదు మేరకు పలు శాఖల ఉపాధ్యాయులు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు శనివారం బల్లికురవ మండల విద్యా వనరుల భవనంలో ఆర్‌జెడి సుబ్బారావు, పర్చూరు డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు విచారించి వారి వద్ద నుండి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్జెడి సుబ్బారావు విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 21 మంది ఉపాధ్యాయులు ఫిర్యాదులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ విచారణకు ఎంఈఓను హాజరు కావాలని చెప్పినా హాజరు కాలేదని మరొకసారి విచారణకు పిలిపించి వివరణ తీసుకుంటామన్నారు. హాజరుకాని పక్షంలో ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసిన ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

కర్ణాటక సీఎం సిద్ధ రామయ్యకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కర్ణాటక సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సిద్దారామయ్యకు బాపట్ల కాంగ్రెస్ శాఖ శనివారం శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని అంజుమన్ కాంప్లెక్స్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాపట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంటా అంజిబాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్ కర్ణాటకలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రిమండలికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. బిజెపి పార్టీ కేవలం మతాన్ని నమ్ముకుంటే కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి ప్రజల సంక్షేమం కొరకు పంచ సూత్రాల పథకాలు మతసామరస్యం మాత్ర మే ఏ జెండాగా పనిచేసి విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ శీలం సాగర్, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, ధోనేపూడి రవి, నళిని, ముత్తయ్య, తాజుద్దీన్, యాసీన్, అబ్దుల్ సుభాని, ఎస్ కే షఫీ, షేక్ గౌస్ బాషా, షేక్ రబ్బానీ పాల్గొన్నారు.

షమీమాకు జగనన్న ఆణిముత్యం అవార్డు

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్.షమీమా జగనన్న ఆణిముత్యం జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ ఏడాది ఇంటర్ సీఈసీ ఫలితాల్లో 938 మార్కులు సాధించటంతో షమీమా ఈ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.అనురాధ తెలిపారు. తోటి విద్యార్థులు షమీమాను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు షమీమాను అభినందించారు.